క్లుప్తంగా

జోరుగా వాహనాల రాకపోకలు

బొబ్బిలి: మండలంలోని పారాది కాజ్‌వే, అప్రోచ్ రోడ్ల మీదుగా వాహనాల రాకపోకలు జోరుగా కొనసాగుతున్నాయి. పారాది వంతెన మరమ్మతులకు గురవడంతో కొత్త వంతెన నిర్మించేంత వరకు ప్రభుత్వం రూ.కోటి వ్యయంతో తాత్కాలికంగా కాజ్‌వే, అప్రోచ్ రోడ్డును నిర్మించిన విషయం తెలిసిందే. ఈ రోడ్ల మీదుగా ఇప్పుడు భారీ వాహనాలు సైతం రాకపోకలు జరుగుతుండడంతో ఓ చోట తారు కాస్త కుంగింది. ఆ ప్రాంతాన్ని ఏజెన్సీ యజమాని పానకాల రావు శనివారం పరిశీలించి, రోడ్డును సరిచేశారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేదని ఏఈ రాజు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వంగర: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ కె.వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. 132/33 కేవీ పాలకొండ నుంచి వంగర వచ్చే విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

శిక్షణా తరగతులు ప్రారంభం

రేగిడి: మండలంలోని శిర్లాం గ్రామంలో జ్యూట్ ప్రాడక్ట్స్(ఉత్పత్తులు) తయారీపై ఉచిత శిక్షణా తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఇస్తున్న ఈ శిక్షణను యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావు కోరారు. బొత్స గురువునాయుడు మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లు సంయుక్తంగా జిల్లా కలెక్టర్ భాగస్వామ్యంతో ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. 18 నుంచి 35 ఏళ్ల వయసున్న యువతీయువకులకు జనపనారతో తయారు చేసే వస్తుసామగ్రిపై శిక్షణ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. 13 రోజుల పాటు జరిగే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకున్న తర్వాత బ్యాంకు లింకేజీ రుణాలు కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో బొత్స గురువునాయుడు మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ మేనేజర్ కె.రవికిరణ్, ట్రైనర్ మల్లీశ్వరి, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు శనివారం సాయంత్రం భూమిపూజ చేశారు. రూ.1.15 కోట్ల నిధులతో గొల్లపల్లి వంతరాం జంక్షన్ నుంచి రంగరాయపురం వరకు 3 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ టి.సత్యారావు, వైఎస్సార్ సీపీ నేత తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని మల్లయ్యపేటలో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ శనివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని, ఇదే సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ సీఎం జగనన్ననే ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు వి.విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి టి.రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.

రాజాం: పట్టణంలోని డోలపేట నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు కొత్త రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ శనివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు రాజాం పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. డోలపేట నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చెరువు గట్టు మీదుగా రోడ్డు ఏర్పాటుకు రూ.2 లక్షలు మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ

రామభద్రపురం: తల్లి గర్భం దాల్చిన నాటి నుంచే మాతా, శిశువు ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఆర్‌జేడీ చిన్మయిదేవి అన్నారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా ఆరికతోట అంగన్‌వాడీ కేంద్రం –1లో ఆమె గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తినేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి, బాడంగి ఐసీడీఎస్ పీవోలు విజయలక్ష్మి, ఎస్.కె. రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శిలువగిరికి మెట్లమార్గం ఏర్పాటు

వంగర: స్థానిక శిలువ గిరికి కొత్తగా ఏర్పాటు చేసిన మెట్లు మార్గాన్ని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు కలిసి శనివారం ప్రారంభించారు. స్వర్గీయ కనగల అప్పలనాయుడు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సర్పంచ్ కనగల భారతి, ఎంపీటీసీ కనగల పద్మ, పారినాయుడు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతిలు సొంత నిధులతో దీనిని నిర్మించారు. కార్యక్రమంలో విచారణకర్తలు రాజు, ధనరాజు పాల్గొన్నారు.

పేదలకు 'పట్టా'భిషేకం



తెర్లాంలో లబ్ధిదారులకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సొంతింటి కల సాకారం
- ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలోని పేదల సొంతింటి కల సాకారమైందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే చేతులమీదుగా శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ ఒక్కరికైనా ఇళ్లస్థలాలు ఇవ్వలేదని, సొంతింటి స్థలం చూపిస్తేనే నిర్మాణానికి నిధులు కేటాయించేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షలాది మంది నిరుపేదలకు ఇంటిస్థలంతో పాటు, ఇంటి నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేశారన్నారు. ప్రతీ పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్న ఏకైక లక్ష్యంతోనే సీఎం జగనన్న.. జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసి, పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారన్నారు. దీంతో పాటు సొంతింటి స్థలం చూపించిన వారికి సైతం ఇల్లు కట్టుకునేందుకు నిధులు మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన కొనసాగిస్తున్నారని, రానున్న ఎన్నికల్లోనూ ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి ఎస్.బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి జి.రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు టి.సత్యంనాయుడు, ఎంపీడీవో బి.మధుసూదనరావు, తహసీల్దార్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని కొండకెంగువ గ్రామానికి చెందిన పలువురికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా ఇళ్లపట్టాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ఈ ఐదేళ్లలో ప్రజలకు చేయాల్సిన మేలును ఆయన చేశారన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా, విమర్శలు చేసినా, ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరన్నారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి నేతలు చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పనులు చేసే సీఎం జగనన్నకు మనమంతా అండగా నిలిచి, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి, వైస్ ఎంపీపీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని పినపెంకి–ఆనవరం జంక్షన్ నుంచి రెండు కిలోమీటర్ల మేర నిర్మించిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో కన్నా వైఎస్సార్ సీపీ హయాంలో ఎక్కువ అభివృద్ధి, సంక్షేమం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే మళ్లీ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ వేణుగోపాలనాయుడు, పార్టీ తెర్లాం మండల అధ్యక్షుడు సత్యంనాయుడు, సర్పంచ్ వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలిపల్లి పైడితల్లి జాతర



పూజలందుంటున్న పోలిపల్లి పైడితల్లి

రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పోలిపల్లి పైడితల్లి జాతరకు రంగం సిద్ధమైంది. 98వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం నుంచి జరగనున్న ఈ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 15వ తేదీన నేత్రోత్సవం నిర్వహించగా, 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జాతర అంగరంగ వైభవంగా జరగనుంది. శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి, విశాఖపట్నం, విజయవాడ, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఈ జాతరకు రానున్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ జాతర నేపథ్యంలో చిరువ్యాపారుల దుకాణాలతో పాటు జెయింట్ వీల్, సర్కస్ సెట్లు తదితర వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణం నుంచి కిలోమీటరు మేర విద్యుత్ దీపాలంకరణ చేశారు. జాతర జరిగే మూడు రోజులూ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు..

జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ మోహనరావు తెలిపారు. బొబ్బిలి జంక్షన్ మీదుగా వచ్చే భక్తుల వాహనాలను పోలీస్ క్వార్టర్స్ వద్ద పార్కింగ్ చేయాలని, బొబ్బిలి వైపు నుంచి వచ్చే వాహనాలను మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న స్థలంలో,... మెంటిపేట మీదుగా వచ్చే వాహనాలు ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద పార్కింగ్ చేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తులు క్యూలైన్ తప్పనిసరిగా పాటించాలని, అలాగే వెంట తీసుకువచ్చే విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. జాతర దృష్ట్యా ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు ట్రాఫిక్ మళ్లిస్తున్నామన్నారు. బొబ్బిలి వైపు నుంచి రాజాం వస్తున్న వాహనాలు చీకటిపేట జంక్షన్ నుంచి గార్రాజుచీపురుపల్లి, జండాల దిబ్బ మీదుగా రాజాం చేరుకోవాలని, బొబ్బిలి వైపు వెళ్లే వాహనాలు బొద్దాం, జండాల దిబ్బ చేరుకుని గార్రాజుచీపురుపల్లి చేరుకుని చీకటిపేట జంక్షన్‌కు చేరుకోవాలన్నారు. బొబ్బిలి జంక్షన్ నుంచి అమ్మవారి ఆలయం వరకు ఎటువంటి వాహనాలకు అనుమతి లేదన్నారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



ఇంటింట ప్రచారంలో పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్, పరిశీలకులు రాజేష్, సూర్యనారాయణరావు

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, రాజాం నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరావు(పులిరాజు) అన్నారు. శనివారం స్థానిక పట్టణంలోని గాయత్రీ కాలనీలో వారు ఇంటింట ప్రచారం చేపట్టి, ఈ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి తీసుకురావాలన్నారు. మనకు అండగా నిలుస్తున్న సీఎం జగన్ వెంటే అందరూ నడవాలని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, పార్టీ నేతలు కె.శంకర్, మణి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్ ప్రారంభం

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల కోసం ఏర్పాటు చేసిన సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్‌ను ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ శనివారం మండల కేంద్రంలో ప్రారంభించారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీకి ఈ వాహనం అందించారని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. రూ.16 లక్షలు నిధులతో సమకూర్చిన ఈ వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

బొబ్బిలి: మండలంలోని పక్కి గ్రామంలో పోలీసులు శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కేంద్ర బలగాలతో స్థానిక పోలీస్ సిబ్బంది చేపట్టిన ఈ కవాతులో రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా, ప్రతీ ఓటరు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయంతో పాటు సకాలంలో కేసుల పరిష్కారం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.బాబు అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని, లోక్ అదాలత్‌లో సివిల్ కేసుల పరిష్కారంతో పాటు చట్టరీత్యా రాజీకి అనుకూలమైన క్రిమినల్ కేసులను కూడా ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు. పరిష్కారమైన సివిల్ కేసులకు సంబంధించి, కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా, ఇదే కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 276 కేసులను పరిష్కరించారు. వీటిలో 8 సివిల్ కేసులు ఉండగా, 239 క్రిమినల్ కేసులు, 22 సారాయి కేసులు, 2 భార్యాభర్తల తగాదా కేసులు, 5 చెక్‌బౌన్స్ కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాజాం జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, రాజాం బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ కె.రమణమూర్తి, ఏపీపీ కిమిడి సూర్యకుమార్, ప్రభుత్వ న్యాయవాది ఎస్.పోలారావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక కోర్టు సముదాయంలో మండల లీగల్ అథారిటీ చైర్మన్ టి.వాసుదేవన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 137 కేసులు పరిష్కరించినట్లు పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞనారాయణ తెలిపారు.

అన్నివర్గాల అభివృద్ధే సీఎం జగన్ అజెండా



రాజాం: రజక సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

రాజాం: అన్నివర్గాల అభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పట్టణంలోని బొబ్బిలి జంక్షన్ వద్ద రూ.4.95 లక్షలతో నిర్మించిన రజక సంక్షేమ సంఘం భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో అన్ని ప్రాంతాల్లోని కుల సంఘాలకు అవసరమైన అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్పొరేషన్లు కూడా ఏర్పాటు చేసి, డైరెక్టర్లు, చైర్మన్ల పదవులు ఇచ్చామన్నారు. కార్పొరేషన్లను గాడిలో పెట్టడమే కాకుండా పెద్దఎత్తున నిధులు సైతం విడుదల చేశామన్నారు. వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ రాజాం నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఎంతో సహకరించారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి రాజాం సమస్యలు తీసుకువెళ్లి, పరిష్కరించారన్నారు. కొత్తగా రోడ్లు, భవనాలు, సోలార్ విద్యుత్ దీపాలు, కొత్త కనెక్షన్లు ఏర్పాటు చేశారన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో కమ్యూనిటీ హాల్‌లు నిర్మించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, పార్టీ రజక సంఘం నేతలు ముసలయ్య, వాసు, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యర్థి ఎవరైతే నాకేంటి?

బొబ్బిలి: ప్రత్యర్థి ఎవరైతే నాకేంటి అని, విజయనగరం ఎంపీ అభ్యర్థిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పేరును ప్రకటించినప్పుడే విజయం దాదాపు ఖాయమైందని ఎంపీ బెల్లాన చంద్ర శేఖర్ అన్నారు. స్థానిక పట్టణంలో కాపు సామాజిక వర్గం నిర్మిస్తున్న సంఘ భవన నిర్మాణానికి ఆయన శనివారం భూమిపూజ చేశారు. ఇటీవల జరిగిన కాపు ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఆయన సంఘ భవన నిర్మాణానికి తాను సిద్ధంగా ఉన్నానని, చెప్పిన కొన్నిరోజుల వ్యవధిలోనే ఇలా భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టడంపై ఆ సంఘ సభ్యులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఎంపీ మాట్లాడుతూ బీసీలు ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో త్వరలో జరిగే ఎన్నికల్లో తాను మళ్లీ ఎంపీగా పోటీ చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. సీఎం జగనన్న, ఇక్కడి బీసీల అండదండలున్నంత వరకు ప్రత్యర్థులు ఎవరైనా తనకు ఒక్కటేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు, కాపు సామాజిక వర్గ నాయకులు రామ్మూర్తినాయుడు, అప్పలస్వామి, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హర్షాతిరేకాలు



బొబ్బిలి: ఎమ్మెల్యే శంబంగికి హారతి ఇస్తున్న మహిళలు



టికెట్లు పొందిన ఆనందంలో కేక్ తినిపించుకుంటున్న ఎంపీ బెల్లాన, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్

బొబ్బిలి: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడునే మళ్లీ పార్టీ అధిష్టానం ఎంపిక చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా ఎమ్మెల్యే దగ్గరకు శనివారం వెళ్లి, స్వీట్లు తినిపించి, ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద సిద్ధం చేసిన ఎన్నికల ప్రచార రథంపై ఊరేగుతూ జై జగన్.. జై శంబంగి అని నినాదాలు చేశారు.

రాజాం: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ తలే రాజేష్ ఎంపికపై పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం ఆయనకు టికెట్ కేటాయించిందన్న విషయం తెలుసుకున్న వెంటనే పట్టణంలోని ఆయన నివాసానికి చేరుకుని, అభినందనలు తెలిపారు. అదే సమయంలో ఎంపీ టికెట్ పొందిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కూడా అక్కడే ఉండడంతో ఆయనకు కూడా అభినందనలు తెలిపారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకుని, ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బి.నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకపత్రాలు అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్

రాజాం: మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తూ మృతి చెందిన వారి కుటుంబాలకు చెందిన వ్యక్తులకు కారుణ్య నియామకపత్రాలు శనివారం అందించారు. వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ చేతులమీదుగా వీటిని అందజేశారు. మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా పనిచేస్తూ మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు చెందిన పైడి ఆశాలత, పడాల శంకరరావు, నాగవంశపు వినయ్‌లకు పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా నియామకపత్రాలు అందజేశామన్నారు. వీరంతా ఆదివారం నుంచి వారికి కేటాయించిన వార్డుల్లో పనిచేస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.